క్లుప్తంగా

గణపతి పూజ, హోమం ప్రారంభం



గణపతి పూజలో భక్తులు

రాంబిల్లి : మామిడివాడ పైడిమాంబ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజను నిర్వహించారు. హోమం నిర్వహించారు. మామిడివాడ సహా పలు గ్రామాల భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. బుధవారం పూజలు కొనసాగనున్నాయి. గురువారం ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళాల సేకరణ



గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. దీనిలో భాగంగా మంగళవారం ఆలయ నిర్మాణానికి తమవంతు సాయంగా తోటాడ సాంబశివరావు, పద్మావతి దంపతులు రూ.10001 నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. భక్తులు మరింతగా స్పందించి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరుతున్నారు.

29 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 29 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఎం.సత్యనారాయణ మూర్తి, మాడెం జోగారావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లి షిరిడీసాయి లా కళాశాల సంయుక్త నిర్వహణలో శిక్షణ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 8919360208 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

రామాలయ నిర్మాణానికి బ్రాండిక్స్ ఆర్థిక సహాయం

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని తంతడిలో రామాలయం నిర్మాణానికి బ్రాండిక్స్ ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి ద్వారా యాభై వేల రూపాయిల చెక్కుని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఏపీ ఎస్ఎస్ఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా చంటిపాప



సంఘ ప్రతినిధుల నుంచి నియామకపు పత్రాన్ని స్వీకరిస్తున్న చంటిపాప

కోటవురట్ల : ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కోటవురట్లకు చెందిన ఎత్తుల చంటిపాప నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర ప్రతినిధి బుల్లా రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంటిపాప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎస్సీ, ఎస్టీలకు అందే సంక్షేమ పథకాలు పారదర్శంగా లబ్ధిదారులకు చేరేందుకు కృషి చేస్తానన్నారు. మహిళల హక్కులకు భంగం వాటిల్లినా, అన్యాయానికి గురైనా తమ సంఘం తరపున పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

నేడు మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లి: మండలంలోని దిబ్బపాలెం గ్రామం శ్రీ మరిడిమాంబ అమ్మవారి విగ్రహప్రతిష్ట బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పీలా ఉషా అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల్లో భాగంగా రత్న, బీజన్యాసములు, శిఖర, యంత్రప్రతిష్ఠ, నేత్రోత్సవం, కూష్మాండబలి, ధేను, దర్పణ దర్శనం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. పట్టణంలోని జగన్నాథస్వామి దేవాలయం అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ విశేష పూజలు జరుగుతాయన్నారు.

ఇది కదా వ్యవ'సాయం'

- అన్నదాతకు ఆత్మీయ నేస్తాలుగా ఆర్‌బీకేలు
- పెట్టుబడి సాయం నుంచి పంటల బీమా వరకూ ప్రభుత్వం తోడ్పాటు
- ఐదేళ్లలో సేద్యాన్ని పండగలా మార్చిన వైనం



అధునాతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం



ఆర్బీకేలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



పీఎం కిసాన్ ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల : రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు నేస్తాలుగా ఉన్నాయి. రైతు దేశానికి వెన్నుముక కాగా అటువంటి రైతన్నను ఆదుకునేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆపన్న హస్తాన్ని అందించారు. రైతుపై ఆర్థిక భారం పడకూడదనే భావనతో సమస్త సేవలను వారికి అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతు భరోసా కేంద్రాలను అధునాతనంగా నిర్మించి వారికి ఆసరాగా నిలిచారు. రైతు సమయం వృధా కాకుండా వ్యయ ప్రయాసలు పడకుండా ఉన్న ఊళ్లోనే అన్ని సదుపాయాలు కల్పించారు. రైతు భరోసాతో పెట్టుబడి సాయంతో మొదలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, పంట నష్టం వరకు అన్నింటా ప్రభుత్వం రైతుకు ధైర్యాన్ని కల్పిస్తూ ఆసరాగా ఉంటోంది. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు దుర్భర జీవితాలను గడిపారు. వ్యవసాయం కలిసిరాక వలస కూలీలుగా మారిన వారు ఎందరో ఉన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులు వ్యవసాయానికి స్వస్తి పలికారు. విత్తనాలు కావాలంటే సుదూరం ప్రయాణించి మండుటెండల్లో బారులు తీరి అవస్థలు పడేవారు. ఎరువులు సమయానికి అందుబాటులో లేక పంటలు నాశనమయ్యేవి. కానీ గత ఐదేళ్లుగా రైతు జీవితం మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామంలోను రూ.లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్న కియోస్కు మెషిన్ల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అన్ని రాయితీపై సకాలంలో అందుతున్నాయి.

సొంతూరులోనే అన్నీ...

మండలంలో 25 గ్రామ పంచాయతీలకు 19 గ్రామ సచివాలయాలు, 18 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.23 లక్షలతో అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం 13 కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో పాటు సేవలు అందిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో 1,560 హెక్టార్లలో వరి సాగు జరిగింది. అగ్రికల్చర్, హార్టీకల్చర్ కలిపి 5,900 హెక్టార్లలోని వివిధ పంటలను వ్యవసాయశాఖ సిబ్బంది గుర్తించి ఈ క్రాప్ నమోదు చేశారు. 265 మందిని కౌలు రైతులుగా గుర్తించారు. మిచాంగ్ లాంటి తుపాను బీభత్సం సృష్టించి పంటలను నాశనం చేసినా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఆర్బీకేలా ద్వారా విత్తు నుంచి పంట చేతికొచ్చేంత వరకు ప్రభుత్వం అండగా ఉంటోంది.

సాగుకు భరోసా వచ్చింది..



నా పేరు పోతల సత్తిబాబు, మా ఊరు ఆక్సాహేబుపేట. మాది వ్యవసాయ కుటుంబం. మా తాతల నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాం. నేను పీజీ చేసినా వ్యవసాయం అంటే మక్కువతో పొలం చూసుకునేవాడిని. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంపై ఆశలు చచ్చిపోయాయి. అప్పట్లో సకాలంలో వర్షాలు లేకపోవడంతో పాటు విత్తనాలు, ఎరువుల కోసం నానా పాట్లు పడేవాళ్లం. క్యూలో నిలుచుని తోపులాడుకునేవాళ్లం. చివరకు నాణ్యమైన విత్తనాలు దొరికేవి కావు. దాంతో వ్యవసాయం మాని వేరే వ్యాపారం చూసుకున్నా. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రైతులకు ఎంతో ప్రోత్సాహం వచ్చింది. రైతు భరోసా కేంద్రాలు మా జీవితాలను మార్చేశాయి. మండల కేంద్రం వెళ్లకుండానే అన్ని సేవలు ఈ ఆర్బీకేలో అందుతున్నాయి. రైతును మళ్లీ నిలబెట్టినందుకు ముఖ్యమంత్రి జగనన్నకు ఎపుడూ రుణపడి ఉంటాం.

– పోతల సత్తిబాబు, రైతు, ఆక్సాహేబుపేట

ఆశలు చిగురించాయి..



మాది నీలిగుంట గ్రామం. నాపేరు భజన సీతయ్య. నాకు వ్యవసాయం అంటే మక్కువ. నాకున్న మూడెకరాల భూమితో పాటు ఇంకా కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటా. టీడీపీ ప్రభుత్వంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారు. నేను చాలా నష్టపోయాను. వ్యవసాయం అంటే చిరాకు పుట్టింది. ఇక చేతులెత్తేసే సమయంలో జగనన్న మళ్లీ సాగుపై ఆశలు పుట్టించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సమయానికి విత్తనాలు అందుతున్నాయి. ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, ప్రోత్సాహం ఉంటోంది. ఇంతకంటే రైతుకు ఇంకేం కావాలి.

– భజన సీతయ్య, రైతు, నీలిగుంట

రైతులు సంతృప్తిగా ఉన్నారు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతులకు నేస్తాలుగా మారాయి. గ్రామ స్థాయిలోనే సమస్త సేవలు రైతులకు అందుతున్నాయి. వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రోత్సాహం ఇస్తున్నాం. గతంలో కంటే ఇపుడు రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆర్బీకేల సేవలతో రైతులు సంతృప్తి చెందుతున్నారు. తుపాను నష్టం కూడా రైతులకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– భీమిరెడ్డి సరోజిని, మండల వ్యవసాయాధికారి

టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



పి.ధర్మవరం పరీక్ష కేంద్రం వద్ద పరిశీలిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు అడిషనల్ క్రైం ఎస్పీ పి.సత్యనారాయణ తెలిపారు. పి.ధర్మవరం పరీక్ష కేంద్రాన్ని మంగళవారం అడిషనల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పరీక్ష నిర్వహిస్తున్న రెండున్నర గంటలపాటు పరిసర ప్రాంతాల్లో బయట వ్యక్తులు ఉండకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరం 144 సెక్షన్ ఉంటుదన్నారు. ఈ పరిశీలనలో స్థానిక ఎస్ఐ విభీషణరావు ఉన్నారు.

ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందాలి



వాడ్రాపల్లి పారిపల్లెమ్మ సన్నిధిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంచుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ(తేజ) కోరారు. వాడ్రాపల్లిలోని పారిపల్లెమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల కన్నునాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షులు శీరా రమణమ్మ ఆయన వెంట పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట : మండలంలో పలు గ్రామాల్లో బుధ, గురువారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. సబ్ స్టేషన్లలో కొన్ని మార్పుల వల్ల పాయకరావుపేట, నామవరం, సీతారాంపురం, పీఎల్‌పురం, గుంటపల్లి, మంగవరం, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం, కేశవరం, రాజవరం, వెంకటనగరం, కుమారపురం, ఈదటం, పాల్మన్‌పేట, రాజయ్యపేట, గొడిచెర్ల గ్రామాలకు ఆ రెండు రోజులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడవచ్చునన్నారు. ఈ గ్రామాలకు కొరుప్రోలు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాకు ఏమైనా అంతరాయం జరిగితే వినియోగదారులు సహకరించాలని కోరారు.

శారదానదిలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



శివ మృతదేహం

మునగపాక : మండలంలోని మెలిపాక శివారు చిన యాదగిరిపాలెం శారదానదిలో గల్లంతైన పదో తరగతి విద్యార్థి కాకర శివ మృతదేహం మంగళవారం లభ్యమైంది. శారదానదిలో ప్రమాదవశాత్తూ జారిపడిన కాకర శివ గల్లంతైన విషయం తెలిసిందే. నదిలో గాలింపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో శివ మృతదేహం కనిపించింది. దీంతో మునగపాక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూకాంబిక జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్ష
- ఎన్నికల నిబంధనలను పాటిస్తూ జాతర ఏర్పాట్లు



నూకాంబిక జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. స్థానిక దేవాలయం ఆవరణలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో దేవాలయం ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి అనుసంధానంగా ఉన్న రోడ్లను రోజూ ఉదయం, సాయంత్రం వ్యర్థాల తొలగింపు చేపట్టి, ట్రాక్టర్‌పై డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. అవసరమైన మేరకు నగరపాలక సంస్థ తరపున ప్రత్యేకంగా స్వీపర్లను నియమించి, రోడ్లు శుభ్రపరచడంతోపాటు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ వేసి రోగాల వ్యాప్తి లేకుండా చూడాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పాడైన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. దేవస్థానానికి వచ్చే మార్గంలో రోడ్డు నాక్రమించి ఏర్పాటైన షాపులను తొలగించాలన్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను సూచించారు. ఏప్రిల్ 7న ప్రత్యేక బందోబస్తుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతర నెల రోజులు మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. అమ్మవారి జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్, నీటి సరఫరాలో అవాంతరాల్లేకుండా చూడాలని ఆయా విభాగాల అధికారులను సూచించారు. జాతరలో మత్తుపానీయాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఎస్ఈబీ అధికారులకు కోరారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ ఎన్.సుజాత, ఏసీ సుధారాణి, డీఎస్పీ అప్పలరాజు, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు, అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగరావు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లెమ్మ పండగ



తుమ్మపాల: మండలంలోని రేబాక గ్రామంలో శ్రీ పోలిపల్లెమ్మ పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, పూజలు జరిపారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పుర వీధుల మీదుగా భక్తులు ఘటాలతో తరలివచ్చి అగ్నిగుండాలు తొక్కారు. మధ్యాహ్నం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మహిళలు చిడత భజనలు చేశారు. సాయంత్రం తీన్‌మార్‌తో అమ్మవారిని ఊరేగింపు చేసి తీర్థప్రసాదాలను నివేదించారు. విద్యుత్ అలంకరణతోపాటు భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయం వద్ద సందడి నెలకొంది. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆహూతుల్ని అలరించింది.

బీవీపీ అధ్యక్షుడిగా వర్మ



విద్యార్థులను సత్కరించిన పరిషత్ నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి: భారత వికాస్ పరిషత్(బీవీపీ) అనకాపల్లి అధ్యక్షుడిగా ఎస్‌ఏబీ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేట పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా దాడి శివరాము, కోశాధికారిగా ఏవీ బ్రహ్మానందంలు ఎంపికయ్యారు. తుని పరిషత్ అధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఎ.ఓంరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అంతకుముందు జీవీఎంసీ పరిధి, తుమ్మపాల, కొప్పాక, మునగపాక, కశింకోట ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ సీనియర్ సభ్యులు పి.మహేశ్వరరావు, ఎస్.గోపాలరావు, కె.రమణ అప్పారావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం



జేవీపాలెం ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



జంగులూరులో మహిళలకు బ్రోచర్ అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే జోగులు

ఎస్.రాయవరం : జగనన్న పరిపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జేవీపాలెం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జేవీపాలెం శివారు జంగలూరు, వెలంపాలెం, సైతారుపేట శివారు వినాయకనగర్, వేమగిరి, సైతారుపేట, పేట సూదిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదలకు మేలు చేసిన వ్యక్తిని మేము ఎప్పుడూ మరచిపోలేము బాబు, మా ఓటు ఫ్యాను గుర్తుకే అని జనం సమాధానం ఇచ్చారు. ప్రతిపక్షాలు మహాకూటమిగా ఏర్పడి ఎన్నికలకు వస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మి పొరపాటున ఓటు వేస్తే మరలా దొంగల చేతికి తాళం ఇచ్చినట్టే అని కంబాల జోగులు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూసుకునే జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకున్నాకే, పేదవాడు మళ్లీ ప్రశాంతంగా జీవించగలడని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ముప్పిన అబ్బాయి దొర, కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, గాడి అప్పలనరసింహం, మైలపల్లి శ్రీనివాస్, కురందాసు గణేష్, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, శిగిరెడ్డి అప్పారావు, కట్టుమూరి చంద్రరావు, కర్రి సత్యారావు, వీసం వెంకటరమణ, వెదుళ్ల బంగారి, వియ్యపు వరహాలు, మణిరాజు, బోయిన లక్ష్మి, నూకునాయుడు, కొర్ని రాజా రమేష్, రామరాజు, జోగిరాజు, పోలిశెట్టి సతీష్, బాబూరావు, బొండా దివాణం, గుర్రం నానాజీ, జగన్ సేవాదళ్ అధ్యక్షులు కె.అమ్మాజి పాల్గొన్నారు.

వైభవంగా ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణం



పంచదార్లలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణం



కోలాటం ఆడుతున్న మహిళలు

రాంబిల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్య క్షేత్రంలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటాక కల్యాణం ఘట్టం ప్రారంభమైంది. పురోహితులు, అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు స్వామి, అమ్మవారి కల్యాణాన్ని కమనీయం..కళ్యాణ వైభోగం అంటూ భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ ఘట్టం మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. రాత్రంతా భజనలు, కోలాటాలు, తప్పెట గుళ్ల వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి ఈ కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు

ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శనలు



పోలిపల్లెమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆకట్టుకున్న కోలాటం

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి. వాడ్రాపల్లిలో పేరుగాంచిన పారిపల్లెమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అలాగే గవర్ల అనకాపల్లిలో పోలిపల్లెమ్మ పండగ కూడా ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు. వాడ్రాపల్లి, గవర్ల అనకాపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అమ్మవారి ఘటాలకు సామూహిక హారతి



సామూహిక హారతి కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

పాయకరావుపేట : కొత్త అమావాస్య, నూకాలమ్మ జాతరలు సందర్భంగా మండలంలో గల కుమారపురం గ్రామంలో గ్రామ దేవతలకు గరగలకు, ఘటాలకు సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో పలువురు మహిళలు హారతి కార్యక్రమం నిర్వహించి, గరగలకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు ఖాతాలతో అధిక లబ్ధి



అధిక పొదుపు ఖాతాలను చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న శ్రీధర్

అనకాపల్లి: తపాలాశాఖలో పొదుపు ఖాతాల ద్వారా అధిక నగదు ప్రయోజనాలను పొందవచ్చని విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం కేజేఎస్ ఫంక్షన్ హాల్లో మంగళవారం పొదుపు ఖాతాలపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖలో పలు మార్పులను తీసుకువచ్చామన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధిక పొదుపుఖాతాలు చేసిన పీఎల్ఐ అభివృద్ధి అధికారి వై.బి.పలాసరావును సర్టిఫికెట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ విల్లూరి సత్యనారాయణ, వివిధ పథకాల సూపరింటెండెంట్లు వెల్లూరు సత్యనారాయణ, సంజయ్ పాండా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.